క్లుప్తంగా

హై జంప్ పోటీలకు మేధినరావుపాలెం విద్యార్థులు



విద్యార్థులను అభినందించిన ప్రధానోపాధ్యాయుడు

దెందులూరు: రాష్ట్రస్థాయి అండర్-14 హై జంప్ భాగంలో మేధినరావుపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు హరి సీతారామయ్య అన్నారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ విభాగంలో మనోహర్, నవ్య శ్రీలు ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎల్‌వీడీ రవికుమార్‌ను సీతారామయ్య అభినందించారు.

అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర నాయకులు

దెందులూరు: అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు కోరారు. శుక్రవారం ఖండ్రిక నర్సింహపురంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వారు నివాళులర్పించారు. భారతదేశ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసేలా రాజ్యాంగాన్ని రచించిన మహానుభావుడి జీవిత విధానం భారతీయులకు ఆదర్శప్రాయం అన్నారు. ఆయన జీవన విధానాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు. ఈ మేరకు సంతకాలు సేకరించి ప్రభుత్వాలకు పంపనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దాన మాండ్రు మధుబాబు, చిలకా హరీష్, సరిపల్లి మహేష్, గులిమే హరిబాబు, భీమడోలు రామకృష్ణ, చిలక విష్ణు, నాగు, వసంత్, వంశీ, మహేష్, చిలక వంశీ, తాడిగడప సంతోష్, చిలక పవన్, గణేష్ పాల్గొన్నారు.

జీతాల కోసం ఆందోళన



ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: మూడు నెలల జీతాలు ఇవ్వాలంటూ మండలంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ స్వీపర్లు, నైట్ వాచ్‌మేన్లు, ఆయాలు స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.విజయలక్ష్మి, సీఐటీయూ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకులు లింగంపల్లి రాంబాబు, సత్యవతి, ఎ.అనంత లక్ష్మి, కె.పద్మ, యు.పుష్ప, కవిత, కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న యూటీఎఫ్ నూతన కార్యవర్గం

ఉంగుటూరు: వచ్చే జనవరి నెలలో కాకినాడలో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీధర్ కోరారు. శుక్రవారం నారాయణపురంలో నిర్వహించిన సంఘం మండల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో శ్రీధర్ మాట్లాడారు. సంఘం కార్యక్రమాలను వివరించారు. ప్రధాన కార్యదర్శి జోగినాయుడు, కోశాధికారి ఆనందకుమార్ నివేదికలను వివరించారు. సంఘం మండల అధ్యక్షుడు ఉసుముల రాంబాబు నూతన కార్యవర్గ సభ్యులను పరిచయం చేసి ప్రమాణస్వీకారం చేయించారు.

గుడిపాటి లలితకు ఏఎన్ఆర్ అవార్డు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సామాజిక సేవ, సంగీత రంగాల్లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా నగరానికి చెందిన విద్యావేత్త, సామాజిక కార్యకర్త డాక్టర్ గుడిపాటి లలితను ఏఎన్ఆర్ అవార్డుకు ఎంపిక చేశామని గరికపాటి ఆర్ట్స్ థియేటర్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన ఉదయం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో ఆమెకు అవార్డు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. వేదుల జయలక్ష్మి, గుడిపాటి రత్న శిరీష, గుడిపాటి విశ్వనాథ్‌ల సంగీత గానామృతం కార్యక్రమం ఉంటుందని, ముఖ్యఅతిథిగా నంది అవార్డు గ్రహీత ఎస్‌వీ రామారావు, అతిథులుగా కళారత్న కేవీ సత్యనారాయణ, గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు తదితరులు హాజరౌతారని వివరించారు.

అందని జీతం.. అప్పుల భారం

- పారిశుద్ధ్య కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు
- ఐదు నెలలుగా జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్
- భారంగా మారిన కుటుంబ పోషణ



భీమడోలు సీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



ఆసుపత్రిని శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

భీమడోలు: వైద్య విధాన పరిషత్‌కు అనుసంధానంగా ఉన్న భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పారిశుద్ధ్య కార్మికులు జీతాలు లేక ఆర్థాకలితో అలమటిస్తున్నారు. ఆసుపత్రుల్లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులు, సూపర్‌వైజర్లకు కాంట్రాక్టర్ ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉద్యోగులకు సకాలంలోనే జీతాలు ఇస్తున్నామని ఊకదంపుడు ప్రచారాలుచేస్తున్న కూటమి ప్రభుత్వం చిరుద్యోగులకు జీతాలు అందించే విషయంలో మీనమేషాలు లెక్కిస్తోంది. పారిశుద్ధ్య కార్మికులకు పీఎఫ్ నంబర్ ఇవ్వలేదు. విధుల్లో చేరిన సమయంలో అబ్జెక్ట్‌షస్ ప్రైవేటు నిర్వాహక సంస్థ ఇస్తానన్న జీతాలను సగానికి పైగా తగ్గించింది. ఇచ్చే రూ.10,500 కూడా సకాలంలో ఇవ్వడంలేదు. పారిశుద్ధ్య కార్మికులు రెగ్యులర్ ఉద్యోగులు మాదిరిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ రెండు, మూడు సార్లు బయోమెట్రిక్ అటెండెన్స్ వేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మిక వ్యవస్థ నిర్వీర్యం

కూటమి ప్రభుత్వం అధికారంలో చేపట్టిన నాటి నుంచి ఆసుపత్రుల్లో పని చేస్తోన్న పారిశుద్ధ్య కార్మికులకు పైసా జీతం ఇవ్వలేదు. పారిశుద్ధ్య వ్యవస్థని నిర్వీర్యం చేసే దిశగా చర్యలు చేపట్టిందనే విమర్శలు వస్తున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వైద్య, రంగాలకు పెద్ద పీట వేసింది. ప్రభుత్వ ఆసుపత్రులు రోగ నివారణ కేంద్రాలు ఉండాలన్న లక్ష్యంతో పారిశుద్ధ్య కార్మికుల వ్యవస్థను తీసుకొచ్చింది. చంద్రబాబు హయాంలో ఆసుపత్రుల్లో కేవలం ఇద్దరికి మించి ఉండేవారు కాదు. ఇద్దరి వల్ల పూర్తిస్థాయి పరిశుభ్రత కష్టమని భావించిన జగన్ ప్రభుత్వం వారి సంఖ్యను మూడు రెట్లు పెంచింది. రోగులుండే గదులు, ప్రాంగణమంతా, టాయిలెట్లు శుభ్రం చేయడం, ఇతర పనుల కోసం ఐదుగురు మహిళా పారిశుద్ధ్య కార్మికులను, ఒక సూపర్‌వైజర్‌ను నియమించింది. వీరు ఉదయం 9 గంటలకు సేవలు ప్రారంభ సమయానికి ఆసుపత్రిని పరిశుభ్రం చేస్తారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిసరాలను, ఇన్, అవుట్ పేషెంట్లు ఉండే 30 గదులను శుభ్రం చేస్తారు. ప్రతి నెలా జీతాలను సకాలంలో వారి ఖాతాల్లో జమ చేసేది. తాజాగా కూటమి పార్టీలు అధికారం చేపట్టిన నాటి నుంచి వారికి ఒక్క నెల జీతం కూడా ఇవ్వలేదు. దెందులూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పారిశుద్ధ్య కార్మికులకు కూడా జీతాలు అందడంలేదు. పండుగ రోజుల్లో జీతాలు అందించి తమ జీవితాలకు వెలుగులు నింపాలని పారిశుద్ధ్య కార్మికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

కుటుంబ పోషణ ఎలా?



కాంట్రాక్టర్ ఐదునెలలుగా జీతాలు ఇవ్వడంలేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి మాది. తెల్లవారేలోపువచ్చి గదులన్నింటిని శుభ్రం చేయాలి. రోగులకు పరిశుభ్ర వాతావరణా న్ని కల్పిస్తున్నాం. నెలకుఇచ్చే అరకొరజీతం సకాలంలో ఇవ్వడంలేదు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– ఎస్ పుష్ప, పారిశుద్ధ్య కార్మికురాలు, భీమడోలు

ఆందోళన ఉధృతం చేస్తాం



జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు, సూపర్ వైజర్లకు కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వడం లేదు. పీఎఫ్ అక్కౌంట్ నంబర్ ఇవ్వడం లేదు. ఒకొక్కరికీ రూ.1 లక్ష వరకు బకాయి ఉంది. ఇటీవల నిరసన కార్యక్రమం చేపట్టాం. సమస్య పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తాం.

– కె.ప్రశాంత్‌కుమార్, సూపర్‌వైజర్, భీమడోలు

మంచినీటి బోరుకు శంకుస్థాపన



బోరుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

ఉంగుటూరు: గోపినాథపట్నంలో మంచినీటి బోరుకు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. దీనికి మండల పరిషత్ నిధులతో కేటాయించారు. సర్పంచ్ పుచ్చకాయల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరించాలి

భీమడోలు: స్థానిక రైల్వే స్టేషన్‌లో ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం నిలుపుదల చేసిన రైళ్లను, రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని కురెళ్లగూడెంలో శుక్రవారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, పెద్దలు, గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఈ స్టేషన్‌లో జన్మభూమి, రత్నాచల్, గౌతమి, షిర్డీ, విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని, యాత్రికుల కోసం రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

పశుగణనకు సహకరించండి

ఉంగుటూరు: పశుగణనకు రైతులందరూ సహకరించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. శుక్రవారం ఉంగుటూరులో పశుగణనకు సంబంధించిన పోస్టరును ఆయన వైద్యాధికారులతో కలిసి విడుదల చేశారు. పశుసంవర్ధక శాఖ జేడీ నాయక్, నియోజకవర్గంలో పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం బాధ్యత అధికారులదే



వాల్ పోస్టర్‌ను విడుదల చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

భీమడోలు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని ఎంపీపీ కనుమాల రామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక సమావేశ మందిరంలో ఎంపీపీ రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో విధిగా ప్రోటోకాల్‌ను పాటించాలని సభ్యులు కోరారు. సమావేశాలకు హాజరు కాని అధికారులకు నోటీసులు జారీకి నిర్ణయించారు. పశు గణన సర్వే, పీఎం సూర్యఘర్ యోజన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఎంపీటీసీ సభ్యులు ముళ్లగిరి జాన్సన్, ఆజామ్, గంటా శ్రీనివాసరావు, సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు తదతరులు పలు సమస్యలను లేవనెత్తారు. బీసీ బాలుర వసతి గృహంలో నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. మండలంలోని నివాస ప్రాంతంలోనే బెల్ట్ షాపులను ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోతోందని తెలిపారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు గత ప్రభుత్వంలో రూ.10 లక్షల మంజూరు కాగా ఆర్ అండ్ బీ అధికారుల ఆ పనులు చేపట్టలేదని వాపోయారు. సూరప్పగూడెంలోని విద్యుత్ కండెక్టర్ ప్రమాదకరంగా మారిందన్నారు. గ్రామాల్లో వీధి కుక్కల సంచారన్ని అరకట్టాలని కోరగా, వాటికి టీకాలు వేయిస్తామని పశుసంవర్ధక ఏడీ ఇ.సాయి రమేష్ బదులిచ్చారు.

నీటి పరిష్కారానికి నిధులు మంజూరు

ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడుతూ ఐదు గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ధర్మరాజు రూ.9.5 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి మాట్లాడుతూ ధాన్యం తరలించే తరుణంలో రవాణా చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. హౌసింగ్ ఏఈ చైతన్య మాట్లాడుతూ 2014-19 హయంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వచ్చే ఆర్థిక సంవత్సరాంతానికి పూర్తిచేయకుంటే వాటి బిల్లులు రావని అన్నారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు కృషి



డ్రెయిన్‌లో గంబూషియా చేపలను వదులుతున్న వైద్య సిబ్బంది

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, దోమల నిర్మూలనకు కృషి చేయాలని స్థానిక పీహెచ్‌సీ సీహెచ్‌ఓ జాలాది విల్సన్ అన్నారు. గణపవరం, సరిపల్లె గ్రామాల్లో దోమలను నిర్మూలించే గంబూషియా చేపలను డ్రెయిన్లలో వదిలారు. కాయిల్స్, తెరల వాడకం ద్వారా దోమల నుంచి రక్షణ పొందాలని, ఇల్లు, ఇంటి పరిసరాల్లో మురుగునీటి గుంటలు లేకుండా చూసుకోవాలని విల్సన్ సూచించారు. దోమల లార్వా దశలోనే రసాయనాలు పిచికారీ చేస్తే దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో కలసి గంబూషియా చేపలను మురుగు కాల్వల్లో వదిలారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

దెందులూరు: వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ అన్నారు. సీతంపేట, పోతునూరు గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటా నిల్వ ఉన్న నీటిని తొలగించారు. అంటువ్యాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి టాబ్లెట్లను అందించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ ప్రవీణ్ ప్రజలకు సూచించారు.

రసాభాసగా సొసైటీ సర్వసభ్య సమావేశం



సమావేశంలో పర్సన్ ఇన్‌చార్జితో వాగ్వివాదానికి దిగిన సభ్యులు

భీమడోలు: గుండుగొలను సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశం సభ్యులు, సహకార శాఖ పర్సన్ ఇన్‌చార్జి, సొసైటీ సిబ్బందికి మధ్య వాగ్వివాదంతో రసాభాసగా మారింది. గుండుగొలనులో శుక్రవారం ఏర్పాటుచేసిన సొసైటీ సర్వసభ్య సమావేశానికి 2800 మంది సభ్యులుండగా కేవలం 60 మంది సభ్యులే హాజరవడంతో కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేయాలని సభ్యులు కోరడంతో నిబంధనలు పాటిస్తున్నామని పర్సన్ ఇన్‌చార్జి అనడం వాగ్వివాదానికి దారితీసింది. పర్సన్ ఇన్‌చార్జి ఏకపక్షంగా సమావేశాన్ని నిర్వహించారని, సభ్యులతో మినిట్ పుస్తకంలో సంతకాలు చేయించుకునే తరుణంలో సిరియల్ నంబర్ వేయలేదని సభ్యులు కిర్ల రాఘవ, చింతా శామ్యూల్‌రాజు, చంద్రు సుబ్బారావు తదితరులు విమర్శించారు. కొందరు సమావేశానికి హాజరైనప్పటికీ మినిట్ పుస్తకంలో సంతకాలు పెట్టించుకోకుండా కార్‌తో పుస్తకాన్ని తీసుకుని వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎజెండాలోని అంశాలను ఎక్కడా అమోదించలేదని పేర్కొన్నారు. కోరం లేకుండా ఏకగ్రీవంగా అమోదించిన అంశాలను నిలుపుదల చేయాలని కోరారు. ఇప్పటికే గుండుగొలను సొసైటీలో సభ్యులు వర్గాలుగా చీలి, ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుని రెచ్చ చేసుకున్న విషయం విదితమే.

కోళ్ల వ్యర్థాల వ్యాన్ సీజ్



కోళ్ల వ్యర్థాలను గోతిలో పూడ్చుతున్న పోలీసులు

భీమడోలు: కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వ్యాన్‌ను సీజ్ చేశారు. హైదరాబాద్ నుంచి భీమడోలు పరిసర ప్రాంతాల చేపల చెర్వులకు కోళ్ల వ్యర్థాలను వ్యాన్‌లో యాజమాని అబ్బాస్, డ్రైవర్ మహ్మద్ ఇమ్రాన్‌లు తరలిస్తున్నారు. వీరిని సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు గ్రామంలోకి 20 టన్నుల కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వ్యర్థాలను దూరంగా గోతిని తీసి పూడ్చారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

లక్ష్య సాధనకు శ్రమించాలి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

గణపవరం: విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, లక్ష్య సాధనకు శ్రమించాలని తాడేపల్లిగూడెం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్ వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సింగిల్ మేజర్ కోర్స్, గోల్ సెట్టింగ్‌పై జిల్లా స్థాయి వర్క్‌షాపు ప్రిన్సిపాల్ పి.నిర్మల కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే చిత్తశుద్ధి, అంకితభావం ముఖ్యమని, విద్యార్థులు చెడు వ్యసనాలకు, ఈవ్‌టీజింగ్ లాంటి దురాచారాలకు దూరంగా ఉండి చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. సింగిల్ మేజర్ సబ్జెక్టు నేటి తరానికి అత్యవసరమన్నారు. డిగ్రీ కోర్సుల్లో స్కిల్ కోర్సుల పైనా, అనలిటికల్ స్కిల్స్‌పైనా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు మాట్లాడుతూ నూతన విద్యా విధానం (ఎన్ఈపీ-2020)లోని కీలక అంశాలను వివరించారు. ఏడాది డిగ్రీ కోర్సు చేస్తే సర్టిఫికెట్, రెండేళ్ల డిగ్రీ కోర్సు పూర్తిచేస్తే డిప్లమో సర్టిఫికెట్, మూడేళ్ల డిగ్రీ కోర్సు పూర్తిచేస్తే డిగ్రీ సర్టిఫికెట్, నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేస్తే హానర్ డిగ్రీ లేదా పీహెచ్‌డీలో ప్రవేశం పొందవచ్చునని తెలిపారు. కె.స్వరూపరాణి మాట్లాడుతూ స్మార్ట్ గోల్స్ గురించి, ఇన్‌స్పైర్ వ్యక్తుల జీవిత చరిత్రలను వివరించారు. అధ్యాపకులు గణేష్‌కుమార్, శ్రీనివాసరావు, జి.వెంకటరమణ మాట్లాడారు. గణపవరం, ఏలూరు, తాడేపల్లిగూడెం, కామవరపుకోట విద్యార్థులు హాజరయ్యారు.

ధాన్యం కొనుగోలుపై 29న రైతు సదస్సు



కైకరంలో కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

ఉంగుటూరు: ధాన్యం కొనుగోలు సమస్యలపైనా, మద్దతు ధరపైనా ఈనెల 29న కైకరంలో జిల్లా స్థాయి రైతు సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కైకరం తూర్పువీధిలో నిర్వహించిన రైతు సంఘాల ప్రతినిధుల సమావేశంలో సదస్సు కరపత్రం విడుదల చేశారు. 29వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు కైకరం తూర్పు వీధి ఎల్ఐసీ భవనం వద్ద నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని శ్రీనివాస్ కోరారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలు ఎ.గ్రేడు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ఇస్తోందని, ఈ ధరలు పెరిగిన ఖర్చుల నేపథ్యంలో గిట్టుబాటు కాదని వివరించారు. క్వింటాలుకు 500 బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కన్వీనర్ కోర్ని అప్పారావు, కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పుస్తకాల పంపిణీ



పెదపాడు హైస్కూల్లో స్టడీ మెటీరియల్ అందిస్తున్న హెచ్ఎం వెంకటేశ్వరరావు

పెదపాడు : జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరయ్యే 8వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశామని పెదపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు తెలిపారు. డెమెట్రిక్ పీఆర్‌టీయూ సంఘం తరపున 28 మంది విద్యార్థులకు శుక్రవారం విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను అందించారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా డీ పీఆర్‌టీయూ తరుపున ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యూవీ సత్యనారాయణ, డ్రాయింగ్ మాస్టరు శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తలపంటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

ఉంగుటూరు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ సూపర్ వైజర్ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం కాగుపాడు పీహెచ్‌సీ పరిధిలోని నాచుగుంటలో డ్రైడే సందర్భంగా అమలవుతున్న కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. దోమలు వృద్ధి అయ్యే ప్రదేశాలను గుర్తించి, వాటిని నిర్వీర్యం చేయగలిగితే దోమలు రావని అన్నారు. దోమల వల్ల డయారియా, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వంటివి వస్తాయని హెచ్చరించారు. నిల్వ నీరు ఇళ్ల ప్రాంగణాల్లో లేకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి కె.శ్రీనివాసరావు, సూపర్ వైజర్ సత్యనారాయణ, గ్రామ ఆరోగ్య కార్యదర్శి ధనలక్ష్మి, ఆశా వర్కర్లు వజ్రమ్మ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మరుగుజ్జు అవగాహన దినోత్సవం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు ఉమా ఎడ్యుకేషనల్ - టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ప్రతినిధులు స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వరల్డ్ డ్వార్ఫిజం డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ ఐబీ విశ్వనాథ్ మాట్లాడుతూ మరుగుజ్జు అనేది ఎక్కువగా జన్యుపరమైన లోపమని, ఈ వ్యాధి బాధిత వ్యక్తులు ఎత్తు తక్కువగా ఉంటారని తెలిపారు. వ్యక్తి డీఎన్ఏలో జన్యుపరమైన మార్పులు లేదా ఉత్పరివర్తనాల వల్ల మరుగుజ్జు సంభవిస్తుందన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రోత్ హార్మోన్ లోపం మరుగుజ్జు తత్వానికి ఒక సాధారణ కారణమని తెలిపారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఫిజియో థెరఫి, స్పీచ్ థెరఫి, కృత్రిమ అవయవాలు, యూడీఐడీ మొదలగు సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దివ్యాంగులు ఈ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ



మాట్లాడుతున్న వైద్యాధికారి లక్ష్మీ సుభద్ర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేదంతో నివారించవచ్చని ఏలూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారి కె.లక్ష్మీ సుభద్ర అన్నారు. ఈ నెల 29వ తేదీన ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని స్థానిక కేపీడీటీ పాఠశాలలో నిర్వహించిన ఆయుర్వేద అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన పరిసరాల్లో లభించే ఔషధ మొక్కలతోను, వంటింట్లో లభించే శొంఠి, మిరియాలు, లవంగాలు, జీలకర్ర, మెంతులు, దనియాలు వంటి దినుసులతో తయారు చేసిన కషాయాలు, చూర్ణాలు ఉపయోగించి వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

దెందులూరు: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం భూ రీసర్వే గ్రామసభల ద్వారా లభిస్తుందని సర్వేయర్ రమణరావు అన్నారు. శుక్రవారం అక్కిరెడ్డిగూడెంలో భూ రీసర్వే గ్రామసభ నిర్వహించారు. రైతులు ఫిర్యాదులు క్షేత్రస్థాయిలో పరిశీలనచేసి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. డీటీ కృష్ణస్వామి, ఆర్ఐ హేమమాలిని, వీఆర్ఓ దుర్గ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మాదేపల్లి విద్యార్థి

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థి బోడిగడ్డ శశిధర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అర్హత సాధించాడని హెచ్ఎం ఎస్ వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో శశిధర్ అండర్-14 విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని వివరించారు. శశిధర్ తోటి పిల్లల్లో స్ఫూర్తి నింపాడని ఎస్ఎంసీ చైర్మన్ కె.సత్యనారాయణతో పాటు హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థితోపాటు పీడీ ఎస్‌కేవీఎస్ మణిని అభినందించారు.

పేదలకు అండగా ఉండాలి



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న జయప్రకాష్

ఏలూరు టౌన్: సమాజంలో పేదలు, ఆదరణకు నోచుకోని వారికి అండగా ఉండాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. ఏలూరు నగరంలో గ్రేట్‌ఫుల్ గిఫ్ట్స్ సొసైటీ ప్రెసిడెంట్ సొంగా మధు ఆధ్వర్యంలో శుక్రవారం పేదలు, వృద్ధులు, మహిళలకు అన్నదానంతోపాటు చీరలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన జయప్రకాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి పేదవానికీ రాబోయే కాలంలో మేలు చేసేందుకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు. సొంగా మధు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఎస్సీ, ఎస్టీ హక్కుల సాధన సమితీ రాష్ట్ర అధ్యక్షుడు మాముదూరి మహంకాళి, మాజీ కార్పొరేటర్ దుర్గారావు, సంస్థ ప్రతినిధులు ఉన్నారు.